RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 128 | ఏప్రిల్ 12, 2025 | వెల : రూ.3-00



సన్న బియ్యం పేరిట స్కాంగ్రెస్ అబద్దపు ప్రచారం..!

4లో..



## మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శనీయం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి :**

మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శనీయమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా హైదరాబాద్ అంబర్ పేటలోని మహనీయుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి మహాత్మ జ్యోతిరావు విగ్రహ ఏర్పాటుకు సంబంధించి నెక్లెస్ రోడ్డు మార్గం ఐమాక్స్ సమీపంలోని స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేసి విగ్రహ ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికలను అందించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్,ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్,పలువురు ప్రజాప్రతినిధులు,నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తుల వెల్లువ

- జిల్లాల్లో ఊపందుకున్న పైరవీలు
- నాయకులు చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు..?
- ఈనెల 14న చివరి గడువు



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**


బడుగు బలహీన వర్గాలకు ఉపాధి అందించే దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస పథకానికి జిల్లాలో దరఖాస్తులు వేలువెత్తుతున్నాయి. దీంతో జిల్లాల్లో యువతి, యువకులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ రాజీవ్ యువ వికాస పథకానికి నిరుద్యోగులతో పాటు పలు రకాల చిన్న వ్యాపారులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. యువతీ యువకులు రాయితీ కోసం ఏదో ఒక యూనిట్ ని ఎంచుకొని దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈనెల 14 వరకు చివరి గడువు ఉండడంతో కార్యాలయ చుట్టూ, మీ సేవ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. ఈ పథకం ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఎంతో దోహదపడుతుందని అధికార పార్టీకి చెందిన నాయకులు పేర్కొంటున్నారు. ఈ రాజీవ్ యువ వికాస పథకానికి నాలుగు కేటగిరీలుగా అందించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఇప్పటికే జిల్లాలో దరఖాస్తు చేసుకున్న వారు అధికార పార్టీలో ఉన్న చోటామోటా నాయకులను దరఖాస్తుదారులు కలిసి తమకు యూనిట్ వచ్చేలా చూడాలని కోరుతూ ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో అధికారులకు తలనొప్పిగా మారింది.

## నేతన్నలు, రైతన్నల సంక్షేమమే ప్రాధాన్యతగా ప్రభుత్వ పాలన

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి :**

నేతన్నలు, రైతన్నల సంక్షేమం ప్రాధాన్యతగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తుందని రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని అపెరల్ పార్క్ లో 7.6 ఎకరాల విస్తీర్ణంలో రూ.62 కోట్లతో లక్షా 73 వేల చదరపు అడుగుల పంక్చుయేట్ వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్( టెక్స్ పోర్ట్) యూనిట్ ను చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశ్రమ శిలా ఫలకాన్నీ ఆవిష్కరించారు. యూనిట్‌లోని ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. అనంతరం

మిగతా 4వ పేజీలో..







# కేంద్రం నుంచి అనుమతులకు కృషి చేయాలి

- ఫ్యూచర్‌సిటీ వరకు మెట్రో విస్తరణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- మెట్రో రైలు విస్తరణ,ఆర్‌ఆర్‌ఆర్, జాతీయ రహదారులపై సీఎం అధికారులతో సమీక్ష

**వేద న్యూస్, హైదరాబాద్ :**

ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్ డెవెలప్మెంట్ యూనివర్సిటీ వరకు 40 కిలో మీటర్ల మేరకు మెట్రో విస్తరించేందుకు కొత్త ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. దాదాపు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందని, భవిష్యత్తు నగర విస్తరణ అవసరాల దృష్ట్యా మెట్రోను మీర్ ఖాన్ పేట వరకు పొడిగించాలని చెప్పారు. అందుకు అవసరం అయ్యే అంచనాలతో డీపీఆర్ తయారు చేసి కేంద్రానికి పంపించాలని సూచించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్లో మెట్రో విస్తరణపై ముఖ్యమంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిని ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఫ్యూచర్ సిటీ డెవెలప్మెంట్ అథారిటీ లు సంయుక్తంగా ఈ రూట్ మెట్రో విస్తరణ బాధ్యత తీసుకోవాలని సీఎం అన్నారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి మొత్తం 76.4 కి.మీ.ల విస్తరణకు రూ.24269 కోట్ల అంచనాలతో డీపీఆర్లను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించింది. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చెరిసగం నిధులు భరించేలా జాయింట్ వెంచర్‌గా ప్రాజెక్టు చేపట్టేలా ప్రతిపాదనలు తయారు చేసింది. కేంద్రం నుంచి అనుమతులు సాధించేందుకు నిరంతరం ప్రయత్నించాలని, అనుమతులు రాగానే పనులు ప్రారంభించేందుకు సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా రీజినల్ రింగ్ రోడ్డు పనులు వేగవంతం చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆర్‌ఆర్‌ఆర్ సమీపంలోనే భవిష్యత్ అవసరాలకు తగినట్లుగా డ్రైపోర్ట్ నిర్మాణానికి రూపకల్పన చేయాలని సూచించారు. ఆర్‌ఆర్‌ఆర్, జాతీయ రహదారులపై సీఎం సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ నగరాన్ని ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌తో అనుసంధానించేలా

మిగతా 4వ పేజీలో..



## నిరుద్యోగుల పక్షాన నిలబడాలనే ఉద్దేశంతో మెగా జాబ్ మేళా

**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**

ప్రజా ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాలనే ఆకాంక్షతో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తుందని రాష్ట్రమంత్రి కొండ సురేఖ అన్నారు. తమ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను గుర్తించి దశల వారీగా 2లక్షల ఉద్యోగాలను కల్పించాలని ఉద్దేశంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. వరంగల్ తూర్పు నియోజక వర్గ పరిధిలోని ఏం కే నాయుడు కన్వెన్షన్ హాల్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను సహచర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీలు జాబ్ మేళాలో నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలను మంత్రులు కొండా సురేఖ, సితక్క, కలెక్టర్ లు పరిశీలించారు. ఈ జాబ్ మేళాకు



ఊహించదాని కంటే భారీ సంఖ్యలో అభ్యర్థులు హాజరైనారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ నిరుద్యోగుల పక్షాన నిలబడాలనే ఉద్దేశంతో మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలోనూ

మిగతా 4వ పేజీలో..



## చల్ల చల్లగా..

- బీర్‌తో వేడి నుంచి ఉపశమనం!
- బహిరంగంగానే మద్యపానం
- పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నా బేఖాతరు

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**

భానుడి ప్రతాపానికి ప్రతి ఒక్కరూ విలవిలలాడుతున్నారు. వేడి నుంచి ఉపశమనం కోసం చల్లటి నీరు సేవిస్తున్నారు. కాగా, వరంగల్ కమిషనరేట్ పరిధిలోని ఎంజీఎం సర్కిల్‌లో మాత్రం ఏకంగా బహిరంగంగానే మద్యం సేవిస్తున్నారు. ఓ డెయిరీ సమీపాన రోడ్డుపైనే అందరూ చూస్తారనే భయం కూడా లేకుండా ఓ ముగ్గురు ఏకంగా బీరు తాగారు. శుక్రవారం వారు బహుశా వేడి నుంచి ఉపశమనం చల్లటి బీరు నుంచి పొందవచ్చని అనుకున్నారే ఏమో తెలియదు కానీ, హాయిగా బీరు తాగేశారు. పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నప్పటికీ అసలు తమకు అవేవీ పట్టింపు లేదన్నట్టుగానే బాహాటంగానే బహిరంగంగా మద్యం సేవించడం గమనార్హం.

# నాణ్యమైన ధాన్యంతో రైతులకు బోనస్



**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి :**

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తేమ 17శాతం ఉండేలా తాలు లేకుండా నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని డిఎంసి (డిస్టిక్ మిషన్ కో-ఆపరేటర్) రేణుక అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రం ఒకటో వార్డు కూడా కూడా లో ఐకెపి కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి రైతు మద్దతు ధర 2320 పై బోనస్ 300 పొందాలన్నారు. నిర్వాహకులు రైతులకు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు కేంద్రాలకు వచ్చిన రైతుల వివరాలను క్రమ పద్ధతిలో రిజిస్టర్ లో నమోదు చేసి కాంటాలు వేయించాలని ఆదేశించారు. ధాన్యం ఆరబెట్టేందుకు రైతులు ట్రాక్టర్లను ఉపయోగించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో టిఎంసి (టౌన్ మిషన్ కోఆర్డినేటర్) శ్వేత, మాజీ కౌన్సిలర్ వేములకొండ పద్మ సైదులు, చింతమల రమేష్, తన్వీర్, సిఓ రోజా, సువర్ణ, దివ్య తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతి రావు పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి :**

దాదాపుగా 200 సంవత్సరాల క్రితం విద్య అనేది కేవలం కొంతమందికి పరిమితం అయిన కాలంలో అంటరానితనం, అస్పృశ్యత వంటి సామాజిక దురాచారాలు వున్న కాలంలో మహాత్మా జ్యోతి రావు పూలే బుడుగు బలహీన వర్గాల ప్రజల విద్య కోసం పాఠశాలలు స్థాపించి, వారికి చదువును అందించారని తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. సామాజిక ఉద్యమకారులు, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతి రావు పూలే 198 వ జయంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంజి రోడ్ నందు గల జ్యోతి రావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు విద్య అందుబాటులో లేని కాలంలో తన సతీమణి సావిత్రి భాయి పూలే ను చదివించి, ఆమె ద్వారా మహిళల విద్య కోసం పాఠశాలలను ఏర్పాటు చేశారని, అందుకే ఈనాటికి మనం మహాత్మా జ్యోతి రావు పూలే జన్మదినం సందర్భంగా ఘనంగా నివాళులు అర్పిస్తున్నామని చెప్పారు.



నేటికి బడుగు బలహీన వర్గాల ప్రజలు తమ పిల్లల ను బడికి పంపే పరిస్థితి లేకపోవడం వలన రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలలు, కస్తూర్బా పాఠశాలలు ఏర్పాటు చేసి ఉచితంగా విద్యను అందిస్తుందని, కాబట్టి పేదలు తమ పిల్లలను ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదివించాలని, చదువు ద్వారా సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తాయని అన్నారు. తాను ఇమాంపేట కస్తూర్బా గాంధీ బాలికల మైనారిటీ పాఠశాలను దత్తత తీసుకొని, జిల్లా కలెక్టర్ సహకారంతో పదిలక్షల రూపాయల వ్యయంతో పాఠశాల ను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. చివ్వెంల గురుకుల పాఠశాలలో మౌలిక సదుపా యాల కల్పన కోసం నిధుల మంజూరు కోసం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లినట్లు చెప్పారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో బిసి కులగణనను చేయడం ద్వారా దేశానికి ఆదర్శంగా నిలిచిందని, బిసి కులగణనను అసెంబ్లీ ఆమోదించిందని, ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తుందని ఆయన అన్నారు. రాబోయే కాలంలో దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాహుల్ గాంధీ నాయకత్వంలో బిసిలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ లు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పి నరసిం హ, గ్రంథాలయ చైర్మన్ రామారావు, బిసి సంఘాల నాయకులు,మాజీ మున్సిపల్ చైర్మన్ లు పాల్గొన్నారు.

## పేదల ఆకలి తీర్చే

# ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి :**



పేదల ఆకలి తీర్చే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట మండలంలోని ఐదవ వార్డు దాసాయిగూడెంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి సన్న బియ్యం పంపిణీలో భాగంగా దాసాయిగూడెంలో మాదన్ హుస్సేన్ ఇంటిలో రేషన్ బియ్యం తో వండిన ఆహారాన్ని వారి ఇంటిలో భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ప్రజలకు మేలు జరిగే విధంగా ఉన్నాయా..! అని వారి కుటుంబ సభ్యులను అడిగి, వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబం ఒక పండగ వాతావరణం లో ఉన్నదని కాంగ్రెస్ అంటేనే పేదల పక్షపాతి ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీను, ముదిరెడ్డి రమణారెడ్డి, కట్కూరి మమతా రెడ్డి, సందీప్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వెంకన్న నాయక్, వల్దాస్ దేవేందర్, పిల్లల రమేష్ పాలడుగు పరుశురాం, నాయుడు, తండు శ్రీనివాస్, యాట వెంకన్న, యాట ఉపేందర్, కరుణాకర్ రెడ్డి, ధర్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి వలలో సీనియర్ అసిస్టెంట్

**వేద న్యూస్, జగిత్యాల బ్యూరో :**

జగిత్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ అధికా రులు దాడులు చేశారు. లంచం తీసుకుంటూ సీనియర్ అకౌంటెంట్ రఘు పట్టుపడ్డాడు. కోరుట్ల పోలీస్ స్టేషన్లో పోలీస్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న పవన్ కుమార్ సిపిఎస్ సంబంధించిన డబ్బులు తమ అకౌంట్లో జమకావాలని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటుగా పనిచేస్తున్న అరిగే రఘు కుమార్ సంప్రదించాడు. దీనికిగాను ఏడు వేల రూపాయలు లంచం కావాలని అడగడంతో ఇస్తానని పవన్ కుమార్ ఒప్పుకున్నాడు.దీంతో సిపిఎస్ సంబంధించిన డబ్బులు ఒక లక్ష నాలుగు వేల రూపాయలు పవన్ కుమార్ అకౌంట్లో జమై నవి.7000 రూపాయలు లంచం ఇస్తామన్న డబ్బులు ఇవ్వాలని అకౌంటెంట్ రఘు కుమార్ కానిస్టేబుల్ పవన్ కుమార్ కు అనేక సార్లు ఫోన్ చేయగా శుక్రవారం కొండగట్టు ఆంజనేయస్వామి జయంతి బందోబస్తుకు వెళుతున్నానని ట్రెజరీ ఆఫీస్ కి వచ్చి ఇస్తానని తెలిపి 7వేల రూపాయలు రఘు కుమారుకు ఇస్తుండగా ఏసీబీ డిఎస్పీ రమణమూర్తి ఆధ్వ ర్యంలో వలపన్ని పట్టుకున్నారు. ప్రజాధనాన్ని దోచే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. "సేవలో ఉండే ఉద్యోగులు సేవను మరిచి లంచాల కోసం ఎదురు చూడటం దురదృష్టకరం"అంటూ పలువురు మండిపడుతున్నారు.

# మహనీయుల యాది మహెూన్నత స్ఫూర్తి

**వేద న్యూస్, హైదరాబాద్:**



భారతదేశ సర్వతోముఖ అభివృద్ధికి తమ జీవితాన్ని ధారపోసిన మహనీయులు స్ఫూర్తితో విద్యార్థులు ముందు డగు వేయాలని కేంద్రసాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ పసునూరి రవీందర్ అన్నారు. ప్రభుత్వ సిటీ కళా శాల సామాజిక శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో జరిగిన 'మహనీయుల స్మరణలో కార్యక్రమ ంలో ముఖ్య అతిథి గా పాల్గొన్న డాక్టర్ పసునూరి రవీందర్ మాట్లాడుతూ మహాత్మా పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ,జగజ్జీవన్ రామ్ లు జీవితంలో అనేక కష్ట నష్టాలు భరించి జాతి లో విజ్ఞాన దీపాన్ని వెలిగించారని చెప్పారు. అణగారిన మహిళల విద్యతోనే సామాజిక ప్రగతి వేగవంతమవుతుందని గ్రహించి అందు కోసం ఎన్నో పాఠశాలలు స్థాపించిన జ్యోతి రావు పూలే సావిత్రీ బాయి పూలే సామాజిక వైతాళికులని కొనియాడారు. ఉన్నత వర్గాల మహిళల సమస్యల కోసం కూడా వారు రాజీ లేని పోరాటం చేశారని రవీందర్ అన్నారు. స్వరాజ్య భారత పాలనా వ్యవస్థకు అంబేద్కర్ తన అసమాన జ్ఞానంతో బాటలు వేశాడని అన్నారు. తన కుంబసభ్యుల ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోకుండా అణగారిన వర్గాల ప్రజల విముక్తి కోసం అంబేద్కర్ నిరంతరం పాటు బడ్డాడని ఆయన విశ్లేషించారు. ప్రపంచ విజ్ఞానవేత్తల్లో అంబేద్కర్ అగ్రగణ్యుడని, దళిత బహుజనుల్లో విద్యా వ్యాప్తికి విశేషంగా కృషి చేశాడని రవీందర్ అన్నారు .మానవహక్కుల సముపార్జనకు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆయన ప్రతినిత్యం పరితపించి సమ గ్రమైన రాజ్యాంగాన్ని దేశానికం దించిన మహనీయుడు అంబే ద్కర్ అని రవీందర్ అన్నారు. సామాజిక మధ్య మాల ప్రభావం వల్ల ఆకారంగా విద్యార్థులు చెడు వ్యసనాలకు లో లోనుకాకుండా బౌద్ధం లోని నైతిక విలువలను జీవితంలో ఆచరించాలని అన్నారు. బాబూ జగజ్జీవన్ రామ్ దళిత బహుజనుల సంక్షేమం కోసం ఎన్నో చట్టాలు తీసుకు వచ్చారని అన్నారు. ఈ కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ శాంతి, డా.శంకర్, డా.కృష్ణవేణి, డా.కె భాస్కర్, డా.శ్రీని వాస్, డా.తిరుపతి, డా. కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథి పసునూరి రవీందర్ ను సామాజిక శాస్త్ర అధ్యాపకులు వైస్ ప్రిన్సిపాల్ ఘనంగా సన్మానించారు కళాశాల బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

**వేద న్యూస్, కాజీపేట :**



జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా 47 డివిజన్ కాజీపేట చౌరస్తాలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ అస్గర్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళో ధారణకు కృషి చేసాడన్నారు. బాలికల కోసం మొదటి పాఠశాలను 1848లో పూణేలో ప్రారంభించాడని, అతను వితంతువుల కోసం ఒక గృహాన్ని కూడా స్థాపించాడన్నారు. భారతదేశ బాలికల కోసం ఒక పాఠశాల ప్రారంభించిన మొట్టమొదటి స్థానిక భారతీయులలో ఉన్నారన్నారు. విద్య యొక్క విశ్వీకరణను సమర్థించిన మొదటి సంస్కర్త కూడా ఆయనే అన్నారు. ఈ కార్యక్రమంలో సిరి లారెన్స్, జిల్లా కాంగ్రెస్ జెనరల్ సెక్రటరీ ఇప్ప శ్రీకాంత్ ముదిరాజ్, దొంగల కుమార్ యాదవ్, బల్ల రాజ్ కుమార్, నీలం బాను, బల వెంకటేష్, రవి, కొంకటే శరత్, సల్లూరి నాగేశ్వరరావు, కామ్పల్లి లక్ష్మణ్, పోగుల శ్రీనివాస్, బుషపాక శ్రీనివాస్, మాతంగి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి :**



మహాత్మా జ్యోతిరావు పూలే 198 జయంతి వేడుకలు బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన బీసీ సాధికారిత సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా బీసీ నేతలు నివాళులు అర్పించిన అనంతరం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, బీసీ సాధికారిత సంఘం కొండ దేవయ్య మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు,ఆదర్శాలు,సిద్ధాంతాలు చాల గొప్పయని,భారత దేశంలోనే ప్రప్రథమ సామాజిక తత్వ వేత్త అని అన్నారు. కులవ్యవస్థను వ్యతిరేకమని,అణచివేతకు గురవుతున్న ప్రజలకు ఆత్మస్థైర్యం అందించేందుకు వారి హక్కుల కొరకు నిరంతరం పోరాడి ఎన్నో సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని అన్నారు. అంతేకాకుండా బడుగు బలహీన వర్గాలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా, ఉపాధి పరంగా, తదితర రంగాలలో అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లారని కొండ దేవయ్య అన్నారు. అనంతరం బీసీ సాధికారిత సంఘం,రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు పోలాస నరేందర్ మాట్లాడుతూ ఉద్యమ కారుడిగా, సంఘ సంస్కర్తగా, అనగదొక్కబడినహృదయాలలో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు ,కుల,మత,వర్గ,వర్ణ,విబేధాలు ఉండ కుండా ఉండాలంటే అన్నింటికీ విద్యనే ముఖ్యమని భావించి తన సతీమణి సావిత్రీ బాయి పూలేని బడికి పంపించారని, పేదవారు విద్యను అభ్యసించుటకు ఉదయం,రాత్రి పూట బడులను స్థాపించారని అంటరాని తనం రూపు మాపుటకు, అనాధ బాలల పాఠశాలలకు,వితంతుల కొరకు, అనాధ బాలల కోసం,వృద్ధుల కోసం ఎనలేని కృషి చేశారని,ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సాధికారిత సంఘం నేతలు కొండ కనుకయ్య,లింగంపల్లి దేవయ్య, తూపుకారి సత్తయ్య, ఇల్లందుల వెంకటేష్, సిహెచ్.రామస్వామి గౌడ్, ఉయ్యాల భూమయ్య, ఎట్టము సాయికృష్ణ,మ్యాన రాజేష్ నిమ్మగడ్డ శ్రీనివాస్,ఓన్నారపు దేవయ్య,చెను హేలపతి,ఎం.చందు, ముద్రకోల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన

# దుండగులను శిక్షించాలి

**వేద న్యూస్, జగిత్యాల బ్యూరో :**



జగిత్యాల జిల్లా మోరపెల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ఏప్రిల్ 6 రోజున రాత్రి పాక్షికంగా ధ్వంసం చేశారు. ఈ మధ్య ఇటువంటి సంఘటనలు చాలా జరుగుతున్నాయి. రాజ్యాంగ నిర్మాత,భారతరత్న, బాబాసాహెబ్ అంబేద్కర్ ఎన్నో కష్టాలు అనుభవించి రాజ్యాంగాన్ని రచించారు.అటువంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలి కానీ వారిపై ఇలా ద్వేషం ఎందుకు వెళ్ళగక్కుతున్నారో అర్థము కావడం లేదు. మేము దీనిపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాం.కాబట్టి ఇప్పటికైనా వెంటనే నిందితులను గుర్తించి చట్టప్రకారం కఠినంగా శిక్షించి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం పెద్ద పూర్ గ్రామ అధ్యక్షులు గొర్రె రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు.

## బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా

# జ్యోతిరావు పూలే జయంతి

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి :**



పట్టణ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడు కలు ఘనంగా నిర్వహించారు. అనంతరం పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ కుల వివక్షకు వ్యతిరేకంగా మహిళ విద్యకు సానుకూలంగా భారతీయ సామాజిక సంస్కర్త విద్యావేత్త 19 వ శతాబ్దంలోని ప్రజలను చైతన్యపరిచిన గొప్ప మహనీయ వ్యక్తి అని కొనియాడారు.మాజీ జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ భారత దేశ మహెూన్నత వ్యక్తి జ్యోతి పూలే జయంతి ఉత్సవాలు బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జరుపుకోవడం సంతోషకరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అధ్యక్షులు గడ్డమీద శీను, స్టేట్ కౌన్సిల్ మెంబర్ కృష్ణస్వామి, రేగుల శ్రీకాంత్, సగ్గు రాహుల్ ,తడక రాజు బుర్ర మనీష్ గౌడ్ ,జవ్వాది రాజశేఖర్,మరియు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పథకం..

# పేదింట్లో ఆనందం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ నియోజకవర్గం సన్న బియ్యం లబ్ధిదారుల ఇంటిలో పండగ వాతావరణం నెలకొన్నది. రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిరుపేదలకు రేషన్ షాపులో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ నియోజకవర్గం గౌరవ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆదేశానుసారం,47 వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎంఏ అలీమ్ ఆధ్వర్యంలో ఇస్లాంపురంలో రేషన్ కార్డు లబ్ధిదారులు అయిన పేదింటి సాధారణ కార్ డ్రైవర్ రాయుల పెద్ది రాజ్,మాధవి దంపతుల ఇంటి వద్ద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించిన సన్న బియ్యంతో వండిన భోజనం వారితో కలిసి సహపంక్తి భోజనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యం పేదల పాలిటవరంలా ఉందని,మా కుటుంబం ఈ పథకం వల్ల ఎంతో లబ్ధి పొందుతున్నామని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హాజీ బాబా,గఫార్,సైదా,చందు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీదర్ ఆధ్వర్యంలో

# గావ్ చలో.. బస్తీ చలో



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి :**

వేములవాడ పట్టణ బిజెపి ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో భాగంగా వివిధ వార్డులలో గావ్ చలో..బస్తీ చలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వార్డులలో పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో గావ్ చలో బస్తీ చలో కార్యక్రమాలలో పాల్గొని పార్టీ ఆవిర్భావం నుండి ఇప్పటి వరకు పార్టీ ఆవిర్భవించిన నుండి కేవలం నాలుగేళ్లలో జాతీయ పార్టీగా అవతరించిన పరిస్థితులను గుర్తు చేస్తూ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న నిధులను, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేశారు. శుక్రవారం రోజున 5,6,7,8,13,18,20,28 వార్డులలో గావ్ చలో బస్తీ చలో కార్యక్రమంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రతాప రామకృష్ణతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్య బలోపేతానికి పూలే కృషి అపూర్వం

– ఓయూ నేత పాలడుగు శ్రీనివాస్



**వేద న్యూస్, ఓయూ:**

విద్య , మహిళల బలోపేతానికి మహాత్మా జ్యోతిబాపూలే చేసిన కృషి అపూర్వమని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నేత పాలడుగు శ్రీనివాస్, బీసీ సంఘం నేత మేకపోతుల నరేందర్ గౌడ్, అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే 199 వ జయంతిని పురస్కరించుకొని జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరగూడ ఓల్డ్ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిబాపూలే దంపతుల విగ్రహావిష్కరణలో పాల్గొని మాట్లాడారు. జ్యోతిబాపూలే సాధించిన ఘనత దేశానికి మార్గదర్శకమైందని , చదువు కోసం ,మహిళల సాధికారత కోసం ఆయన చేసిన కృషి అపూర్వమన్నారు. సామాజిక ఉద్యమకారునిగా, కుల వివక్షతకు వ్యతిరేకంగా ,అన్ని వర్గాల సమానత్వానికి కృషి చేసిన మహాత్మ జ్యోతిబాపూలే సేవలు నేటి సమాజం ఆచరిస్తున్నదన్నారు. జ్యోతిబాపూలే చేసిన సేవలను నేటి విద్యార్థులకు, చిన్న పిల్లలకు అధికారులు, సామాజికవేత్తలు అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కుల ,మత, వర్గ భేదాలు లేకుండా అందరూ కలిసి చదువుకునేలా ఒక్కొటి 200 కోట్ల రూపాయలతో "యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను" రాష్ట్రవ్యాప్తంగా స్థాపిస్తున్నదని, ఇందులో భాగంగానే నల్గొండ జిల్లాలో 6 పాఠశాలలు మంజూరయ్యాయని, ఇందులో ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనార్టీ అన్ని వర్గాల పిల్లలు ఉంటారన్నారు. మూడో విడత దేవరకొండకు కుడా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల మంజూరయ్యిందని తెలిపారు. కష్టపడి చదవటం తప్పా, చదువుకు దగ్గరి దారులు లేవని, అందువల్ల విద్యార్థులు బాగా చదవాలని, ప్రతి ఒక్కరు జ్యోతిబాపూలేని ఆదర్శంగా తీసుకొని

# బహుజనుల రాజ్యాధికారం కోసం మా భూమి రథయాత్ర

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఎస్సీ ఎస్టీల రాజ్య స్థాపన ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎస్సీ ఎస్టీ బీసీ జేఏసీ ఏర్పాటు చేయడం జరిగిందని డి.ఎస్.పి మండల అధ్యక్షులు గద్దల సైదులు అన్నారు. బహుజన రాజ్యాధికారం దేయంగా ఈనెల 14న అదిలాబాద్ జిల్లాలో 1 లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర నిర్ణయించడం జరిగిందని అన్నారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ రైట్స్ అండ్ రాజ్యాధికార సాధన జేఏసీ కన్వీనర్ అండ్ ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు బహుజనులు కదిలి రావాలని తెలిపారు. శుక్రవారం దామరచర్ల మండలం లో డీఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో దామరచర్ల మండల అధ్యక్షులు గద్దల సైదులు మాట్లాడుతూ 1లక్ష మా భూమి రథయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి రోజున అదిలాబాద్ నుండి రథయాత్ర మూడు సంవత్సరాల మూడు నెల పాటు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను చుడుతూ హైదరాబాద్ చేరుకుంటుందని 1లక్ష కిలోమీటర్ల మాభూమి రథయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించేందుకు బహున సమాజ చైతన్యం కోసం ఈ కార్యక్రమాని కి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. రథయాత్రతో పాటు గ్రామంలో గడప గడపకు పదివేల కిలోమీటర్ల పాదయాత్ర కూడా నిర్వహిస్తు గ్రామాలలో ఉన్న సమస్యలను నేరుగా తెలుసుకుంటామని అన్నారు. 90 శాతం ప్రజలకు నాణ్యమైన విద్య వైద్యం ఉపాధి భూమి ఇల్లు ప్రతి ఒక్కరికి అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే మన భూమి కోసం, మనసంపద కోసం మన రాజ్యం కోసం కలిసి పోరాడాలని బీసీ,ఎస్సీ,ఎస్టీ ప్రజలను కోరుకుంటున్నామని మాట్లాడటం జరిగింది. ఈ సమావేశంలో మండల నాయకులు మాతంగి మల్లికార్జున,గంధం దేవేందర్,ఈటల నరేష్ లు పాల్గొన్నారు.

# వేసవి దృష్ట్యా మంచినీటి సమస్య తలెత్తకూడదు

– అధికారులకు ఎంపీడీవో ఆదేశం

**వేద న్యూస్, కమలాపూర్ :**

కమలాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు శుక్రవారం రోజున ఆర్ డబ్ల్యూ ఎస్ (రూరల్ వాటర్ అండ్ శానిటేషన్) అధికారులతో మండలంలో గల తాగునీటి సమస్యపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా గ్రామాలలో మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలు అన్నిటిని తీసుకోవాలని సూచించారు. గ్రామంలో ఎక్కడైనా మంచినీటి సరఫరా పైప్ లైన్ పగిలిన, వేరే ఇతర సమస్య ఏర్పడిన తక్షణమే మరమ్మత్తులు చేయించాలని, వాల్స్ ఎక్కడ కూడా లీకేజీ లేకుండా ఎప్పటికప్పుడు చూసుకోవాలని, అదేవిధంగా ప్రతి నెల 1వ, 11వ, 21వ తేదీలలో మంచినీటి ట్యాంకులన్నీ శుభ్రం చేసుకునే విధంగా కార్యచరణ సిద్ధం చేసుకోవాలని పలు సూచనలు చేశారు. మంచినీటి సరఫరా విషయంలో ఎటువంటి సమస్య ఏర్పడిన తక్షణమే స్పందించాలని ప్రజలకు మంచినీటి సరఫరా విషయంలో అలసత్వం ప్రదర్శించకూడదని, సమస్య ఉందని తెలిసిన మరుక్షణమే దానిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్ డబ్ల్యు ఎస్



డిఈ (డివిజనల్ ఇంజనీర్) బాలరాజు, ఏఈ (అసిస్టెంట్ ఇంజనీర్) లక్ష్మీపతి, కమలాపూర్ పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా

# మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి

**వేద న్యూస్, రాజన్న జిల్లా ప్రతినిధి :**



సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీవై నగర్ అమృత లాల్ శుక్ల కార్మిక భవనంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ రమేష్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే బడుగు బలహీన అణగారిన,వర్గాలకు తన జీవితాంతం పనిచేసిన సామాజిక విప్లవ కారుడు జ్యోతిరావు పూలే మహిళలకు విద్య అందించాలని అన్నారు. అగ్రవర్ణాలతో పోరాడి మహిళలకు విద్య అందించిన మహానాయకుడు అంటరానితలానికి వ్యతిరేకంగా సమ సమాజం కోసం పోరాడిన మహావీరుడు పూలే ఆశయాల సాధన కోసం నేటితరం కృషి చేయాలన్నారు. కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం రోజురోజుకు కులాల మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నదన్నారు. బీసీలకు చట్టసభలు దామాషా పద్ధతిగా రిజర్వేషన్ కల్పించకుండా సుప్రీంకోర్టులో ప్రధాని నరేంద్ర మోడీ కేసు వేసిండు బీసీ అని చెప్పుకుంటూ బీసీ ప్రధానిగా ఉంటూ బీసీలకు అన్యాయం చేస్తున్న నరేంద్ర మోడీ బీసీలకు బద్ధ శత్రువు అని విమర్శించారు. బీసీలను రాజకీయంగా ఎదగకుండా అణచివేయాలని బిజెపి,నరేంద్ర మోడీ విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని జ్యోతిరావు పూలే ఆశయ సాధన కోసం బీసీల ఐక్యత కోసం ప్రజలందరూ ఏకం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ముషం రమేష్, సీపీఎం జిల్లా కార్యవర్గ వర్గ సభ్యులు కోడం రమణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సూరం పద్మ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వెలిగేటి రాజశేఖర్, సీపీఎం సీనియర్ నాయకులు మిట్టపల్లి రాజమల్లు, సిపిఎం నాయకులు నక్క దేవదాస్, బే జిగం, సురేష్ కోడం శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే

# సంపూర్ణ ఆరోగ్యం



**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

పోషకాహారం తీసుకుంటేనే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ టీచర్ సుకినె మాలతి పేర్కొన్నారు. ఎల్కతుర్తి మండల పరిధిలోని చింతలపల్లి గ్రామంలో అంగన్ వాడీ సెంటర్‌లో శుక్రవారం పోషణా పక్షం నిర్వహించారు. ఇందులో భాగంగా చిరుధాన్యాలు, పౌష్టిక ఆహారంతోనే గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని మాలతి వెల్లడించారు. పిల్లలకు పోషకాహారం అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు మొదటి 1,000 రోజుల ప్రాముఖ్యతను వివరించారు. తల్లి పాల ప్రాముఖ్యతను, 6 నెలలు దాటిన పిల్లలకు పోషకాహారంపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం2 పుష్పలత, ఆశా సునిత, గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

హనుమాన్ జయంతి సందర్భంగా శోభయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమాన్ శోభాయాత్ర లో ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా నిర్దేశించిన మార్గం ద్వారా,సమయపాలన పాటిస్తూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహించుకోవాలని కోరారు. శోభ యాత్ర నిర్వహించే సమయంలో ఇతర మతాల వారి మనోభావాలను కించపరిచే విధంగా నినాదాలు చేయరాదని మత సామరస్యంతో సోదరభావంతో ర్యాలీ నిర్వహించుకోవాలని అన్నారు. సామాజిక మాధ్యమాలలో అభ్యంతరకరమైన పోస్టులు,తప్పుడు ప్రచారాలను పోస్టు చేస్తూ వివాదాలకు దారి తీసే విధంగా పోస్టు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ ద్వారా 24/7 పర్యవేక్షిస్తూ నిరంతరం నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎలాంటి తప్పుడు ప్రచారాలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. హనుమాన్ శోభాయాత్ర నిర్వహులు బాధ్యతగా శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తూ పోలీసుల సూచనలూ పాటిస్తూ సహకరించగలరని అన్నారు. డీజే లకు అనుమతి లేదు: జిల్లా ఎస్పీ నల్గొండ జిల్లా పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో



ఉపయోగించే డీజేలతో సహా అధిక వాల్యూమ్ సౌండ్ ఎమిటింగ్ సిస్టమ్‌ల వినియోగంపై నిషేధం విధించడం జరిగిందని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో డీజేలు నుంచి ఉత్పన్నమయ్యే అధిక డెసిబెల్స్ కారణంగా మానవ ఆరోగ్యం, మానసి ఆరోగ్యంపై హానికరమైన ప్రభావాలు పడుతున్న కారణంగా నిషేధించడం జరిగింది ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించ రాదని అన్నారు.

## కాశిభాగ్, గోల్ హనుమాన్ దేవాలయాల్లో పారిశుద్ధ పనులు




వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి: మెట్ పల్లి పట్టణంలో శనివారం హనుమాన్ జయంతి పండుగ పురస్కరించుకొని మెట్టుపల్లి పట్టణంలో గోల్ హనుమాన్ మందిరం పరిసరాల్ల పట్టణంలో కాశి బాగ్ హనుమాన్ టెంపుల్ పరిసరాల్లో పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హనుమాన్ జయంతి రోజున పట్టణంలోని అన్ని హనుమాన్ ఆలయ పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచాలని, అన్న ప్రసాదం జరిగే ఆలయాల్లో వాటర్ ట్యాంకర్ ద్వారా నీరు పోయవలెనని, ఆలయ పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించడం జరిగిందని తెలిపినారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, నిజాం, అశోక్, వాల్గాట్ నరేష్ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

వేద న్యూస్

శనివారం ఏప్రిల్ 12, 2025

# సమసమాజం కోసం పోరాడిన మహనీయుడు జ్యోతిబాపూలే

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



సమాజంలో అన్ని వర్గాల సమానత్వం కోసం పోరాడిన మహనీయులలో మహాత్మా జ్యోతిబా పూలే ఒకరని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా ములుగు రోడ్డు జంక్షన్ లోని మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి కే ఆర్ నాగరాజు,కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఆనాటి సమాజంలోని రుగ్మతలను పారద్రోలడానికి ఉద్యమిస్తూ భవిష్యత్ తరాలకు మార్గం చూపిన మహనీయుల్లో జ్యోతిబాపూలే ఒకరని పేర్కొన్నారు. అంటరానితనాన్ని రూపుమాపేందుకు, విద్యా విషయంలో పూలే దంపతులు చేసిన కృషి ఎంతో గొప్పదన్నారు. సమానత్వం కోసం వారు చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. మహిళలు విద్యావంతులు కావాలని చెప్పిన మొదటి వ్యక్తి జ్యోతిబా పూలే అని అన్నారు. జ్యోతిబాపూలే సతీమణి అయిన సావిత్రిబాయి పూలే మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా సేవలను అందించారని, పూలే దంపతులు ఆనాడే బాలికల కోసం విద్యాలయాన్ని స్థాపించి బాలికలు చదువుకోవాలని అవగాహన కల్పించారని గుర్తు చేశారు. సమాజానికి జ్యోతిబాపూలే అందించిన సేవలను ఆదర్శంగా తీసుకొని అంబేద్కర్ లాంటి వారు ముందుకు సాగారని అన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేశారని, వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారని పేర్కొన్నారు. సమాజంలో అభివృద్ధి అనేక సంస్కరణలు తీసుకువచ్చి చరిత్రలో పూలే దంపతులు నిలిచారని తెలిపారు. సమాజానికి ఉపయోగపడే అనేక కార్యక్రమాలను చేసిన మహనీయుల కృషి ఫలితంగానే మనం ఆ ఫలాలను పొందుతున్నామన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు హక్కులు కల్పించాలనే సంకల్పంతో తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టి అమలు చేస్తున్నామని అన్నారు. మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ ఆర్డీవోలు రాథోడ్ రమేష్, సత్యపాల్ రెడ్డి, హనుమకొండ జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రామ్ రెడ్డి, ఇతర అధికారులతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం పేరిట స్కాంగ్రెస్ అబద్ధపు ప్రచారం..!

- సన్నబియ్యం పథకం విప్లవాత్మకం
- పేదల మనసులో పెద్దన్న మోదీ
- పేదలంతా వినియోగించుకోవాలి
- వరంగల్ బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గంలోని దేశాయిపేట వినాయక వీధి 12వ డివిజన్ లో రాగి రజిని- రాజు దంపతుల ఇంట్లో సన్నబియ్యంతో వండిన అన్నంతో శుక్రవారం వరంగల్ బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ బీజేపీ నాయకులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ సన్నబియ్యం లబ్ధిదారుని ఇంట్లో భోజనం చేయడం ఎంతో ఆనందంగా ఉందని, లబ్ధిదారుని ఇంట్లో అన్నం తింటుంటే తన సొంతింట్లో తిన్నట్టు అనిపిస్తుందన్నారు. సన్నబియ్యం పంపిణీతో పేదవాడి కుటుంబం ఆనందంతో పెద్దోలు తినే బియ్యం పేదోలు తింటున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ పథకం ద్వారా పేద ప్రజల కడుపు నింపడానికే 80 శాతనికి పైగా బడుగు, బలహీన, దళిత, గిరిజన, మైనారిటీ నిరుపేద ప్రజలు లబ్ధిపొందుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గడిచిన 5 సంవత్సరాలుగా కరోనా సమయం నుంచి దేశవ్యాప్తంగా ఉచిత బియ్యం పంపిణీకి సహకరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్, ఎరుకుల రఘునరెడ్డి, గడల కుమార్, దీందయాల్, జిల్లా కార్యదర్శి గోకె వెంకటేష్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి సూరజ్ గౌడ్, మండల అధ్యక్షులు విప్ప సుధాకర్, నాయకులు బీకే రాజు, సతీష్, శ్రీనివాస్, యుగేందర్ కార్యకర్తలు పాల్గొన్నారు

# ఘనంగా జ్యోతిరావు పూలే 198 జయంతి వేడుకలు

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండల కేంద్రంలో జ్యోతిరావు 198వ జయంతిని పురస్కరించుకొని జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. చేనేత సహకార సంఘ అధ్యక్షుడు, పద్మ శాలి గ్రామ అధ్యక్షుడు బాసని ప్రకాష్ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఆయన భార్య అయిన సావిత్రిబాయి పూలే ఈ దేశంలో అనేక ఉద్యమాలను తీసుకొచ్చి మహిళలు చదువుకోవాలి అని మహిళలకు చదువు చెప్పించడం జరిగిందని వారు కొనియాడారు. సతీసాగమనాన్ని వ్యతిరేకించి మహోత్తం ౕమైన ఉద్యమాన్ని నిర్మించిన మహాయోధుడు జ్యోతిరావు పూలే వీరి సేవలు ఈ దేశానికి ఆదర్శప్రా యంగా ఉన్నాయని ఆయన సేవలను కొనసాగించే విధంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అగ్రవర్ణ పేదలందరూ ముందు నడవడానికి వారు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో హనుమకొండ పద్మశాలి జిల్లా కార్యదర్శి వద్దేపల్లి శ్రీనివాస్, మండల అధ్యక్షులు మంగరి సాంబయ్య, మహిళా అధ్యక్షురాలు బాసని శాంత, గ్రామ శాఖ అధ్యక్షులు బాసాని ప్రకాష్, తుమ్మ ప్రభాకర్ ,మాజీ సర్పంచ్ పలుపదాసు చంద్రమొగిలి, గొట్టిముక్కుల సుమన్, చిందం రవి, బాసానిమార్కండేయ, బాసాని రవి, దిడ్డి ప్రభాకర్ ,గొట్టిముక్కుల రమేష్, బూర లక్ష్మీనారాయణ, బత్తుల రవి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ కార్యాలయంలో ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు నంద్యాడపు వెంకటేష్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడాడు,విద్యను ప్రతీ ఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. మహిళల విద్యను ప్రోత్సహించాడు,సావిత్రిబాయి పూలేతో కలిసి సామాజిక సంస్కరణల కోసం పని చేశారు. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి అధ్యక్షులు నాగుల శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్ ,జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, పట్టణ ఉపాధ్యక్షులు గాజుల సదానందం, మోర శ్రీహరి, జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులు దూడం శివప్రసాద్, సుంకరి బాలకిషన్, రాజు సింగ్, కర్నే రేవంత్, సిరిసిల్ల వంశీ,సుధాకర్, వేముల సురేష్, రాజ్ కుమార్ ,అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## ..ప్రాధాన్యతగా ప్రభుత్వ పాలన

**మొదటి పేజీ తరువాయి**


యూనిట్‌లోని ఉద్యోగులతో ముచ్చటించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేతన్నల జీవనోపాధి కల్పించే విధంగా సిరిసిల్ల గడ్డ మీద వర్కర్ టూ ఓనర్, అపెరల్ పార్క్ ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. రైతన్నలు, నేతన్నల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత అని, వీరిని దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతులు కల్పిస్తూ రాష్ట్ర యువతకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. 20 వేల 600 కోట్ల రూపాయల రైతులకు ఏక కాలంలో రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని, నేతన్న లకు కూడా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా 34 కోట్ల రూపాయలతో లక్ష రూపాయల రుణమాఫీ పూర్తి చేశామని మంత్రి తెలిపారు. నేతన్న లకు పెండింగ్ లో ఉన్న 914 కోట్ల బకాయిలు విడుదల చేయడం జరిగిందని అన్నారు. ఒకే రోజు వివిధ పథకాల క్రింద 290 కోట్ల నిధులు జమ చేసామని, చేనేత భరోసా, చేనేత బీమా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో అన్ని శాఖలలో అవసరమైన వస్త్రాలను చేనేత కార్మికుల ద్వారానే కొనుగోలు చేస్తున్నామని, ఇప్పటికే కార్మికులకు 900 కోట్ల రూపాయల ఆర్డర్స్ ప్రభుత్వం అందించిందని అన్నారు. ముఖ్యమంత్రితో చర్చించి త్వరలోనే వర్కర్ టు ఓనర్ కార్యక్రమం పునరుద్ధరిస్తామని అన్నారు. చేనేత రంగానికి చెందిన పరిశ్రమలను సిరిసిల్ల , వరంగల్ వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నామని, దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో పనిచేస్తున్న చేనేత కార్మికులు తిరిగి వచ్చేలా మౌలిక వసతుల కల్పన కృషి చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఏ పని చేసినా తెలంగాణ ప్రజల కష్ట ఫలితం మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, కంపెనీ సీఈఓ చంద్రశేఖర్, ఎస్పీ మహేష్ బీ గీతే, సెస్ ఛైర్మెన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, సిరిసిల్ల ఆర్డీవో రాధా బాయ్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ రాఘవేందర్, ప్రజా ప్రతినిధులు ప్రజలు కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం నుంచి అనుమతులకు కృషి చేయాలి

మొదటి పేజీ తరువాయి : జాతీయ రహదారికి ప్రతిపాదనలు తయారు చేసి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు పం పించాలని సూచించారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదే శించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. పలు చోట్ల పంటలు ఉన్నాయని, పంట నష్టపరిహారం చెల్లించేందుకు ఎన్‌హెచ్ఏఐ అంగీకౕరించడం లేదని అధికారులు సీఎంకు వివరించారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు రేడియల్ రోడ్లు, ఆర్ఆర్ఆర్ నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న రహదారుల విస్తరణపైనా ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం అన్నారు. ఈ సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాస రాజు తదితరులు పాల్గొన్నారు.

## పూలే ఆశయసాధన కోసం పని చేయాలి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



మహాత్మా జ్యోతి రావు పూలే 198వ జయంతి సందర్భంగా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, కాంగ్రెస్ నాయకులతో కలసి పట్టణంలోని మహాత్మ జ్యోతి రావు పులే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ సుప్రసిద్ధ భారతీయ సామాజిక కార్యకర్త, ఆలోచనాపరుడు,కుల వ్యతిరేక సంఘ సంస్కర్త మరియు రచయిత.పూలే అంటరానితనం నిర్మూలన కోసం మహిళలు మరియు అణగారిన కులాల ప్రజలలో విద్యావ్యాప్తికి తన కృషిని కొనసాగించాడు అని కొనియాడారు.పూలే తన భార్య సావిత్రిభాయి పూలేతో కలిసి 1848లో పూణెలో బాలికల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించాడు. పూలే కలలు కన్న సమాజం నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తూ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు సమాన హక్కులు కల్పించేందుకు కుల గణన నిర్వహించారని అన్నారు. అలాగే బిసి లకు 42శాతం రిజర్వేషన్ పెంచి వారి అభ్యున్నతిని పెంచేందుకు కృషి చేశారని అన్నారు. పూలే ఆశయ సాధనలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ కాంగ్రెస్ కౌన్సిలర్లు,వార్డు ఇన్చార్జులు,వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## ఆర్.కృష్ణయ్యకు ఘన స్వాగతం

**వేద న్యూస్, ఎన్టీపీసీ జ్యోతి నగర్ :**

వివిధ కార్యక్రమాలలో పాల్గొనడానికి రామగుండం ప్రాంతానికి విచ్చేసిన బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్యను రామగుండం రైల్వే స్టేషన్ వద్ద బిజెపి రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి కలిసి ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య, కందుల సంధ్యారాణి సమావేశమై, బీసీ వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రాబోయే రోజుల్లో బీసీల హక్కుల కోసం మరింత పోరాడాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కందుల పోచం,చిలువేరు కుమార్, ఎరుకొండ తిరుపతి,మడిపెల్లి సంతోష్,పవన్ సింగ్, కుమార్, అశోక్,సాయి చందన్,బడికెల కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.




## ఐఎన్టియుసి జిల్లా ప్రెసిడెంట్ గా చందర్

**వేద న్యూస్, ఎన్టీపీసీ జ్యోతి నగర్:**

పెద్దపల్లి జిల్లా ఐఎన్‌టియుసి యూనియన్ ప్రెసిడెంట్‌గా భూమల్ల చందర్ ను నియమించినట్లు ఆ యూనియన్ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎన్టిపిసి టౌన్షిప్ లోని మజ్దూర్ యూనియన్ ఆఫీసులో జరిగిన విలేకర్ల సమావేశంలో నూతనంగా ఎన్నుకోబడిన జిల్లా ఐఎన్టీయూసీ యూనియన్ ప్రెసిడెంట్ భూముల చందర్ వివరాలు తెలియజేశారు. ఈ ఆయన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎన్టీయూసీ యూనియన్ బలోపేతంకు కృషి చేస్తానని అన్నారు. నియమకానికి సహకరించిన మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్,విజయ రమణ రావు కు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు నాయకులు చందర్ ను శాలువుతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి నాయకులు రాజేశ్వర్,వేముల కృష్ణయ్య, జమీల్ పాషా, గోశిక రవి, వెంకటేష్, లక్ష్మయ్య శ్రీనివాస్, రాజు తదితరులు ఉన్నారు.

## టిఎస్ఆర్డిఏ రాష్ట్ర అధ్యక్షుడిగా డా.శ్రీనాథ్

**వేద న్యూస్, హైదరాబాద్:**



హైదరాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో తెలంగాణ రాష్ట్రంలోని సీనియర్ రెసిడెంట్ డాక్టర్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ సీనియర్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కార్తీక్ నాగుల పదవీకాలం ముగిసింది. దీంతో వారి ఆధ్వర్యంలో ఇటీవల కొత్తగా నియమితులైన సీనియర్ రెసిడెంట్లతో కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టిఎస్ఆర్డిఏ రాష్ట్ర అధ్యక్షునిగా డా. శ్రీనాథ్ (జిఎంసీ భూపాలపల్లి) మరియు కార్యవర్గంలో జనరల్ సెక్రటరీగా డా. కరిష్మి (గాంధీ మెడికల్ కాలేజ్), ఉపాధ్యక్షులుగా డా. అఖిల్ (గాంధీ మెడికల్ కాలేజ్), డా.మోతే ప్రణయ్ (ఆదిలాబాద్), డా. అరుణ్ కుమార్ (జిఎంసీ ఖమ్మం), డా. పవన్ కల్యాణ్ (జిఎంసీ నిజామాబాద్), అధికార ప్రతినిధిగా డా.కౌశిక్ (జిఎంసీ మహబూబ్‌నగర్) నియమితులయ్యారు.



## ఐకెపి సెంటర్లను ప్రారంభించిన కౌశిక్ రెడ్డి

**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని కమలాపూర్, మరిపల్లిగూడెం, ఉప్పల్, శనిగరం, నేరెళ్ల, శ్రీరాములపల్లి, గూనిపర్తి, మాదన్నపేట, గుండేడు గ్రామాలలో ఐకెపి (ఇందిరా క్రాంతి పథం) వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం రోజున హుజురాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటుగా కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రవీందర్, వైస్ చైర్మన్ ఐలయ్య, పలు గ్రామాల డైరెక్టర్లు, డీఎస్‌ఓ కొమురయ్య, డి ఎం మహేందర్, ఎమ్మార్వో సురేష్ కుమార్, ఎంపీడీవో గుండె బాబు, ఏవో రాజ్ కుమార్, డి టి రమేష్, ఏపీఎం నారాయణ, ఏఈఓలు, సీసీలు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళా

**మొదటి పేజీ తరువాయి**

ఉద్యోగావకాశాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళా యువత కెరీర్ కు ఎంతో దోహదపడుతుందని అన్నారు. 65 కి పైగా వివిధ మల్టీ నేషనల్ కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొని నైపుణ్యాలను బట్టి ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. జాబ్ మేళా ద్వారా ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకోవాలన్నారు. ఈ జాబ్ మేళాలో మొత్తం 23,238 మంది నిరుద్యోగ యువత హాజరు కదా.. 5,631 మందికి ఉద్యోగాలు లభించాయి. 18 వేల మంది రిజిస్టర్ చేసుకోగా..9046 మంది ఉద్యోగ అభ్యర్థికి ఫైనల్ రౌండ్ కి షార్ట్ లిస్టు అయ్యారన్నారు. వీరికి మరొక పరీక్ష నిర్వహించి సెలెక్ట్ చేస్తారని ఆయా కంపెనీల నిర్వాహకులు తెలిపారు. అయితే, ఇంత సంఖ్యలో నిరుద్యోగ యువత హాజరు అయి సంపూర్ణంగా వినియోగించుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంకి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ మంత్రులు కృతజ్ఞతలు చెప్పారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073